తేలు కాటు

శ్రీ జొ. రమాకాంత్

ముఖ్యవీధిన అందకత్తె జనుచుండినచో నొక సంచలనము పుట్టును. ఇదమిద్ధమని నిర్ణయింపరాని పలురకములైన భావములు రేకెత్తును. క్షణికమైన ఈ అనుభూతిని తొలుత ఆనందింతుము; అది పొందరాని వస్తువని గుర్తించి ఆత్మగతమున విచారింతుము! ఆమె ప్రవర్తనయందు చిలిపితనమో, వెకిలితనమో, తదితరమైన యసాధారణతయో గోచరించునపుడు మనస్సున వికృతమగు కాంక్ష జనించును. ఇది సామాన్యము.

లచ్చి పల్లెపడుచు. అందకత్తె. పట్టణమునకు అదే మొదటిసారి రాక. వీధులు, మనుజులు, భవంతులు వింత వింతలు గన్పట్టుచుండెను.

లచ్చి అమాయకురాలు. గుణవంతురాలు. తనతల్లిదండ్రుల కిష్టము లేకున్నను రామిగానినే పెండ్లాడెను. రామిగాడు సాధువు. పరువు మర్యాదలు కలవాడు. పౌరుషము గలవాడు. వారామెను వల్లనికీయ నిశ్చయించిరి. వల్లనికి రెండెకరముల పొలముండెను. కండపుష్టి కలవాడు. పలుకుబడి గలవాడు. దూరపు బంధువు. మిత్రుడు. లచ్చి ప్రకృతి చిత్రమైనది. వల్లడన్న ఆమెకసహ్యము. దీనికొక ప్రత్యేక కారణము లేదు. ఇది బుద్ధి విషయము కాదు. మనోవిషయము. సామాన్యముగా ఇట్టి భావములు కొన్ని వస్తువుల చూచినపుడు, కొందరి మనుజుల జూచినపుడు కలుగును. కొన్ని రూపములకు ప్రత్యేక గుణముల నాపాదింతుము. కొన్ని గుణములకు ప్రత్యేక రూపముల సృష్టింతుము. కొంతకాలమున కీ కల్పన మఱుతుము. అప్పుడు గుణములలో రూపము, రూపములో గుణములు గాంతుము...లచ్చి పట్టుదలగల మనిషి. వల్లని కిచ్చుచో బలవన్మరణము నొందెద ననెను. తలిదండ్రులు బెదరి పోయిరి. రామిగాడు ఒక ఆసామివద్ద భూమి కవులుకు తీసికొనెను. లచ్చి వచ్చినసంవత్సరమే చెల్లెలి పెండ్లి నిమిత్తము ఆయనవద్ద వందరూప్యములు అప్పుతీసికొనెను. ఆ ఏడు మిడతలు పంటనంతయును నాశనము చేసెను. తరువాత సంవత్సరము బకాయితీర్చుటే కష్టతరమాయెను. ఈ సంవత్సరము అతివృష్టివలన పైరులు మురిగిపోయి ఎకరమునకు మూడుబస్తాల ధాన్యమయ్యెను. కవులుదారీ చట్ట మమలులోనికి రానున్నదనియు, భూమి రామిగాని పరమగుననియు ఆసామి కెవరో బోధించిరి. భయము బలవంతమైనది. తన పైకముకొఱకు వత్తిడి చేయసాగెను. రామిగానికి సంభవించిన విపత్తు తానెరిగినదే. అతడును చెప్పుకొనెను. కాని ఆసామి వినిపించుకొనలేదు. పైగా అతని ననరాని మాట లనెను. అతనికి రోషము కలిగెను. లచ్చిని పుట్టినింటికంపి తాను నెలరోజులలో తిరిగివత్తునని పట్టణమేగెను.

కాపురమున కేగినపిదప పుట్టినింటి కప్పటివరకు పోలేదు. కొన్ని రోజులు ప్రశాంతముగ గడచెను. వల్లని రాకపోకలు పెరిగెను. అనవసరముగ ఆమెతో కల్పించుకొని మాటలాడుచుండెడివాడు. వారు రామిగాని నాడిపోసుకొనెడువారు. చాటున మాటున సూటిపోటి మాట లనుచుండెడివారు. ఆమె కది దుర్భరమయ్యెను. రోజులు లెక్కించుకొనుచు ఎట్లో కాలము గడిపెను. స్త్రీపురుషులమధ్య నింత తారతమ్యమేల. కుమారు డప్రయోజకుడై ఇంటనుండినను సమంజసమే కాని అవసరమునకు పుత్రిక పుట్టింటనుండుట సహించరు. ఒక ప్రేగునుండి జన్మించినవారియందు సంఘమున కీ విభేదమేల? తలిదండ్రులకీ విచక్షణెందులకు? తొమ్మిది వారములు గడిచెను. జాబైనను రాలేదు. ఆమె నవ్వుల పాలాయెను. ఎంతతొలగి తిరిగినను కవ్వించి ఎగతాళిచేయువారు.

ఒక సాయంకాలము తలిదండ్రులు పొలమేగిరి. సంధ్యచీకటులు ముదిరెను. వారురాలేదు. లచ్చి భోజనముగావించి వసారాలో వారికొఱకు నిరీక్షించుచుండెను. ఇంతలో వల్లడు వచ్చెను. ఆమె వారెవ్వరు లేరని చెప్పెను. తనకు తెలియునని సమాధాన మొసగెను. ఆమె కనుమానముకలిగెను. భయపడెను. ఇంతలో వల్లడు రామిగాడిక రాడనియు, తాను మూడేండ్లనుండి ఆమెకై తపించుచుండెననియు, ఇప్పటికీ ఆమెను నిరభ్యంతరముగ స్వీకరింతుననియు ఏమేమో ప్రేలుచు

చెయ్యి పట్టుకొనెను. ఆమె కావేశము కలిగెను. కొండంత మనిషిని ఒక్కపెట్టున త్రోసెను. అతడు నిలువున నేలకూలెను. అతని ఉద్రేకము హెచ్చెను. వెంటనే లేచి వికటముగ నవ్వుచు పిట్టవలె అడలుచుండిన దానిని చేతులలోనికి లాగుకొనెను. ఆమె మూర్ఛిల్లెను. ఉన్మాదమున కది తెలియదు.

ఆమెకు తెలివి వచ్చునప్పటికింకను అతని కౌగిలిలోనే యుండెను. అతడు గాఢముగ నిద్రించుచుండెను. పట్టు వదల్చుకొని ఈవలకు వచ్చెను. రాత్రి ప్రొద్దుపోయెను. ఆమె లోనికరిగెను. తలిదండ్రులు యథాస్థానమున నిశ్చింతగ నిదురించుచుండిరి. పన్నాగ మవగతమాయెను! కోపము ఆశ్చర్యము, అసహ్యము ఆవేశము ఒక్కపెట్టునవచ్చి ఆమెను తబ్బిబ్బు పఱచెను. ఆ యింట నొక్కక్షణ ముండతగదని స్ఫురించెను. వెంటనే మూటముల్లె సర్దుకొని రామిగానికొఱకు పట్టణమునకు బయలుదేరెను.

పట్టణమున ఒక సత్రమునందు బసచేసెను. ఆ సత్రము మధ్య ఖాళీస్థలముండును. చుట్టు రెండుమూడు గదులుగల భాగములున్నవి. తూర్పుప్రక్కన నాలుగు గదులలో సత్రాధిపతి నివసించును. అతడు మంచివాడనియు, దైవభీతి గలవాడనియు, సత్యవ్రతుడనియు పేరుగాంచినవాడు. ఒంటరిగనున్న స్త్రీలు తరచు ఆసత్రమునకే పోవు ఆచారము కలదు. వారికి తనప్రక్కనున్న గదులిచ్చును. అతని కిటీవల భార్యపోయెను. తల్లిముదుసలి. ఆమెయే ఎట్లో వండిపెట్టి ఒకమూల పరుండును. ఆమెకు పుట్టెడు చెవుడు.

లచ్చి రామిగానికొఱకు వీథులన్నియు తిరుగుచుండెను. వచ్చు, పోవువారిని విమర్శగా చూచి నిరాశచెందుచుండెను. ఆమె వ్యాపారము పలువురకు చోద్యముగా నుండెమ. ఆమె అలసిపోయెను. అతనిజాడ ఎవరైన తెలుపగలరేమోనని తీరికగా నిలబడి ధూమపానము చేయుచున్న నొకనిని, రామిగాడు తెలియునేమోనని ప్రశ్నించెను. పట్టణమున ప్రజలు పలురకములు. వేష భాషలు, వ్యాపారవ్యవహారములు, ఊహా ప్రవర్తనలు వేరువేరు. అనేక విషయములగూర్చి ప్రస్తావించుకొనుచు, విమర్శించికొనుచు, వాదించుకొనుచు, పరిహాసము లాడుకొనుచు వీథులవెంట నిరంతరము తిరుగుచుండెడివారి సంఖ్య పెద్దది. ఆంతరంగికముగా కాంక్షించుదానినే పైకి బిగ్గరగా పలువురు నిరాకరింతురు. దానికనేక కారణము లుండవచ్చును. తమ కోరిక యసాధ్యమని ఎఱిగి కొందరు, తమకట్టి కోరిక లున్నవని పరులెరిగిన తమ పరపతికి భంగము వాటిల్లునని కొందరు, తమ శారీరక మనోభావముల తర్కించి వాని స్వరూపముల గుర్తింప సాహసించనివారు కొందరు. అనుభవజ్ఞుల తరగతి వేరు. వారు మెలకువలు తెలిసినవారు, సాహసింపగలిగినవారు, తేనె పూసినట్లు మాటలాడ నేర్చినవారు. లచ్చి ప్రశ్నించినవాడు ఈ తెగకు చెందినవాడు. ఆమె అందకత్తె. అతనిదేహము పులకరించెను. 'ఓ తెలియకేం! ఎర్రగా దృఢంగా ఉంటాడు కదూ' అనెను.

'కాదు. పొట్టిగ నల్లగొంటాడు' అని లచ్చియనెను. మాటలలోని 'యాస'ను అతడు పూర్తిగ గుర్తించెను. వెంటనే ఇంకొక యబద్ధమాడెను. 'అతడా! మా ఇంటి ప్రక్కవారింట్లో కొలువుకుంటున్నాడు. చూపుతాను పద' అనుచూ ఒక 'టాక్సీ'ని పిలిచెను. ఆమె కనుమానము కలుగకపోలేదు. కాని మనిషి మర్యాదస్తునివలె నుండుటచేసి నమ్మెను. కొంతదవ్వేగినపిదప రామిగాడు వారింట నెంతకాలమునుంచి పనిచేయుచున్నాడని ప్రశ్నించెను. అతడు తడబడెను. సంవత్సరమునుంచి ఉన్నాడని బొంకెను. వెంటనే లచ్చి 'ఐతే ఆడు కాడు' అని లేవబోయెను. ఆ పురుషుడు వ్యంగ్యముగ నవ్వెను. 'ఫరవా లేదులే' అనెను. అతని కన్నులలో మెరుపు ఆమె గుర్తించెను. వెంటనే 'కారు' నాపించి, దిగి చరచర వెడలిపోయెను. అండలేని వారి అందము దుఃఖభాజనము!

సత్రము చేరునప్పటికి ప్రొద్దుపోయెను. సత్రాధిపతి మంచివాడు. ఆమెకు వంటకై వలయు వస్తువులన్నియు నిచ్చెను. తన ఇంటిలోని పచ్చళ్ళను సహితము పంపెను. లచ్చి సంతోషించెను. వీథులన్నియు తిరిగి డస్సియుండుటవలన త్వరత్వరగ భోజనము ముగించి వసారాలో ప్రక్క పరుచుకొని పండుకొన్నదే తడవుగా నిద్రించెను. కొంతసేపటి కామెకు హఠాత్తుగ మెలకువవచ్చెను. ప్రక్కగదిలో ఎవ్వరో 'అయ్యో, అమ్మో' అని మూలుగుచున్నట్లుండెను. చెవులు నిక్కపొడుచుకొని వినెను. 'అబ్బ! ఈ తేలెక్కడ్నించి దాపురించిందిరా!...అయ్యో నీళ్ళు మంచినీళ్ళు — అబ్బో' అనుచుండిరి. ఆ గదిలో సత్రాధిపతి నివసించునని వెంటనే జ్ఞాపకము

వచ్చెను. నిజము! అది అతని కంఠస్వరమే. వెంటనే ఓరగా వేసియున్న తలుపులు తెరుచుకొని అతని గదిలో ప్రవేశించెను. దీపము పెద్దదిచేసి మంచినీరునిచ్చెను. అతడు బాధపడుచుండిన వానివలె నగుపించలేదు. చిత్రము! మంచినీరు సావకాశముగ త్రాగెను. చేయి కనబడనట్లు తడుముచు ఆమెచేయి పట్టుకొని చెంబు నందించెను. అది సాధారణమైన పట్టుకాదు. రక్తములోని ఉడుకు శరీరములోని ఆత్రము మనసులోని తహతహలలో కూడిన సందేశమును ప్రసరింపజేయు సాధన. ఈ రెండుమూడు రోజుల అనుభవమువల్ల వెంటనే దానిభావము ఆమెకు పూర్తిగ అవగతమాయెను. ఆమె ఆశ్చర్యమునకు మేరలేకపోయెను...లోకపు స్వరూపము తెలియుచున్నకొలదియు ఆమె ఊహకు సత్యమునకుగల విపరీత భేదమును గాంచి దిగ్భ్రాంతి చెందుచుండెను...అతని గుణములు పలువురు ప్రశంసించిరి. అతని ప్రవర్తన అప్పటివరకు హృద్యముగ నుండెను. అతనిజాలి జాలికాదా? అతనికరుణ కరుణకాదా?... తానే పొరపడెనా...లచ్చి చెంబు నందుకొనెను. తేలెక్కడున్నదని ప్రశ్నించెను. మాయమైనదని వ్యంగ్యముగా సమాధానము చెప్పెను. ఆమె సంశయము తొలగిపోయెను. అతడు చిత్రముగ ప్రవర్తింపదొడగెను. మత్తుగాలేచి ఒడలు విరుచుకొనుచు బిగ్గరగ నవ్వెను. లచ్చి కావేశము కలిగెను! ఆమె కన్నులు చింతనిప్పులయ్యెను. చూపులు అగ్నిజ్వాల లట్లుండెను. అతడు బెదిరిపోయెను. గడగడ వడకుచు నేలకూలెను. ఆమె చకచక తన గదిలోనికిపోయి తలుపు బిగించుకొని వంటయింటిలో ప్రక్క పఱచుకొని పండుకొనెను.

ఆమెకు నిద్ర పట్టలేదు. అంతులేని ఆలోచనలు తెరలుతెరలుగా వచ్చుచుండెను. వల్ల డొక్కడే దుర్మార్గు డనుకొనుచుండెడిది. లోక మెంతచెడ్డది! ఒక యనాథయందమును గౌరవించలేని పాడుప్రపంచము! పురుషులందరును ఒకేరకము!!

కాని సత్రాధిపతి ప్రవర్తన కాతడే బాధ్యుడు కాడు. భార్యపోయిన క్రొత్తలో ఒకతె తీర్థయాత్రలకేగుచు ఆ గదులలోనే బసచేసెను. రాత్రి రెండు ఝాములు గడిచినపిదప తేలు కుట్టినదని అరచెను. అతడామె గదిలోనికి పోయి తేలెక్కడ కుట్టినదని ప్రశ్నించెను. మనసును కుట్టినదని అభినయపూర్వకముగా తన అభిప్రాయము వ్యక్తీకరించెను. తదుపరి తేలుమంత్రము చాలసారులు సహాయపడెను. ఈసారి మంత్రము పారలేదు.

ఆమెకు కునుకు పట్టలేదు. పట్టణమన్న ఏమో ఎఱుగదు. పట్టణము చేరినవెంటనే రామిగాడిని కలువవచ్చునని గంపెడాశతో వచ్చెను. అప్పుడే ఒకరోజు వృథాయయ్యెను. కర్తవ్యముకూడ తెలియరాకుండెను. ప్రతివారును తన్నుపయోగించుకొనుటకే ప్రయత్నించిరి కాని తనపై జాలితలచినవారు లేకపోయిరి. తన కర్మను నిందించుకొనెను. కాని ధైర్యము కోల్పోలేదు. మరునాడు తప్పక కలువగలడని సమాధానపఱచుకొనెను...ఇంతలో తన కాలిపై నేదో కీటకము ప్రాకెను. వెంటనే లేచి ప్రక్కపై తడిమిచూచెను. హటాత్తుగ విద్యుత్ప్రసారమగుచున్న తీగెను తాకినట్లయ్యెను. తన చేతిని ఒక్కసారిగ అగ్నిగుండమున పెట్టినట్లయ్యెను. ఏదో కుట్టినదని తెలియుటకు కొంత కాలము పట్టెను. సన్నని దీపపు కాంతిలో పొయ్యివైపున కొక తేలుపోవుట గుర్తించెను. ఆమె పై ప్రాణములు పై నెగిరిపోయెను. పూర్వము తేలు కుట్టినప్పుడు ఎంత ప్రమాదమగు బాధపడెనో జ్ఞాపకమునకు వచ్చెను. బాధకును భీతికిని తాళలేక ఒక్కపెట్టున బిగ్గరగా అరచెను.

సత్రాధిపతి అప్పటి కింకను నిద్రింపలేదు. వస్తుతః మంచివాడు. చేసిన తప్పునకు పశ్చాత్తాపపడెను. వణు కింకను తగ్గలేదు. కాని ఆర్తనాదము విన్నవెంటనే ఒడలు పులకరించెను. మదిలోని పేరాశ ఉప్పొంగి అతని తబ్బిబ్బు చేసెను. ఉత్సాహముతో ఆవేశముతో ఆమె తలుపు రెక్కల త్రోసెను. బీగము విరిగిపోయెను. లచ్చి బాధతో గిలగిల కొట్టుకొనుచుండెను. అతడు సిగ్గుపడి పిట్టంత మనిషాయెను. తన ప్రవర్తన తనకే అసహ్యమాయెను. ఆమెయందు చెప్పరానంత దయకలిగెను. అప్రయత్నముగ కన్నులవెంట బొటబొట నీరు కారెను...ఈ మార్పు నామె గుర్తించెను. అతడు తేలుపోయిన దెసకు తిరిగి జాగరూకతతో దానిని కనుగొని చంపెను. అది ఒంటిపూసతేలు!! అతనికి ముచ్చెమటలు క్రమ్మెను. మతిపోయినంత పని జరిగెను. ఇంతలో ఆమె తెలివితప్పి నురుగులు గ్రక్కమొదలిడెను. అతని గుండెలు దిగజారెను. ఎట్లో పొరుగునున్నవారి సాయముతో ఆమెను వెంటనే వైద్యాలయమునకు గొనిపోయెను. రాత్రికి నియమింపబడిన వైద్యుడు శలవు తీసికొనెను. ప్రధాన వైద్యునకు కబురంపిరి.

వైద్యుని ఇల్లు అక్కడికి మైలుదూరముండును. ఆతడు వీధిలోనికి వచ్చునప్పటికి 'టాక్సీ'లుకాని బండ్లుకాని లేవు. ఒక రిక్షావాడు మాత్రము కనుబడెను. అతడు అర్ధరూపాయి ఇమ్మనెను. సాధారణముగా ఆ సమయమున రూపాయి పుచ్చుకొందురు. ఐనను వైద్యుడు బేరము లాడసాగెను. మనిషి బరువు మనిషి. లాగుకొనిపోవుటయే అప్రశస్తము. వైద్యుడు నిజముగా బేరములాడ నవసరములేదు. ఆ రిక్షావాడమాయకుడు. లేకున్న రెండురూపాయల దగ్గరనుండి బేరము మొదలుపెట్టువాడు. చివరకు ఆరణాలకి ఒప్పుకొనిరి. ఒంటరితనము మఱచుటకు కాబోలు, వైద్యుడు వానితో మాటలు పెంచెను. అతనికి రోజు కెంత గిట్టుబాటగునని అడిగెను. తాను రాత్రి మాత్రమే రిక్షా లాగుదుననియు, పగలు కర్మాగారమునందు పని చేయుదుననియు చెప్పెను. తగు విశ్రాంతిలేక కష్టపడుట శరీరమునకు మంచిదికాదని బోధించెను. అప్పు డాతడు తన చరిత్ర కొంత తెలిపి తనకీ బాధ ఇంకొక పది పదిహేను రోజులలో పోవునని చెప్పెను. వైద్యు డాతని దీక్షకచ్చెరువొందెను. వైద్యశాలవద్ద దిగి రూపాయి ఇచ్చెను.

సత్రాధిపతి లచ్చివద్దనే యుండెను. దానికంతకు తనే కారకుడనని పరితపించెను. తేలు నాటక మాడనిచో ఆమె వంటింటిలో పండుకొనెడిది కాదు. ఈ విపత్తు సంభవించెడిది కాదు. స్త్రీ హత్య చేసినట్లే భావించెను. పసిపిల్లవానివలె వాపోవు చుండెను... అప్పుడే ధైర్య మేల కోల్పోవలయును. తేలుకాటువలన చచ్చువారు సాధారణముగ నుండరు. కాని ఇది ఒంటిపూస తేలు! దీని కాటుకు మందులేదని లోకోక్తి. దానికి శాస్త్రీయ నిదర్శనము లేదు. లచ్చిని కావుమని భగవంతుని హృదయపూర్వకముగ ప్రార్థించుచుండెను. ఆమె ఏవేవో పిచ్చిమాటలు మాట్లాడుచుండెను. భయముచే వడకును. బాధచే కొట్టుకొనును. మధ్య మధ్య వల్లని పేరు వినబడును. అప్పుడు పండ్లు కొరుకును. తేలు తేలని అరచుచు ఏడ్చును. రామిగానిని తలచి చిరునవ్వు నవ్వును.

వైద్యుడు తిరిగి వచ్చునప్పటికి తొల్లిటి రిక్షావాడే వేచియుండెను. అతడు రోగివిషయము ప్రశ్నించెను. ఆమెపరిస్థితి చూచునప్పటికి వైద్యుని మనస్సుకూడ కరిగెను. 'ఎవరో పాపం! పల్లెపడుచు. ప్రొద్దునే ఏటివైపునున్న సత్రాని కొచ్చిందట... తేలుకుట్టింది' అనెను.

'తేలేనా'యని రిక్షావాడు సర్దుకొనెను.

'కాని అది ఒంటిపూస తేలుట......అసలామె శరీరానికి తేలుకాటే ప్రమాదం. అందులో ఒంటిపూస తేలు!...పాపమామె చెడ్డబాధ పడుతున్నది...'

తనభార్య తేలుకుట్టినప్పు డెంత అవస్థపడెనో హటాత్తుగ జ్ఞప్తికివచ్చెను. గుండె ఝల్లుమనెను.

'...ఆ అమ్మాయిని చూస్తే నాకే జాలేస్తున్నది. కాని ఆమెను రక్షించటం నా శక్తికి మించినపని. ఆ భగవంతు డనుగ్రహిస్తేతప్ప!'

'తెలివుందా బాబూ'

'తెలి వెక్కడిదీ డిస్నంది. హాస్పిటల్ కొచ్చేటప్పటికే మతిపోయింది...అసలు తే లెక్కడకుట్టిందోకూడ ఎవ్వరికి తెలీదు...'

'పాపం!' అది అప్రయత్నముగ వెలువడినమాట. వైద్యునిమాటలు వినుచుండెనే కాని ఆతనిబుద్ధి చచ్చుపడెను. ఆలోచన నశించెను. యంత్రమువలె చరచర రిక్షా నీడ్చుకొని పోవుచుండెను. హృదయములో నొక నల్లకల్లోలము రేకెత్తెను. తుది మొదలులేని అనేక భావములు ఒక్కపెట్టున చెలరేగెను. మనసులో చెయ్యివేసి కదలవేసినట్లయ్యెను.

'...ఏవేవో పిచ్చిపిచ్చిమాటలు మాట్లాడుతుంది...వల్లడు వల్లడంటుంది. పండ్లు కొరుకుతుంది. రామిగా డంటుంది నవ్వుతుంది...'

—ఇంతలో వైద్యునికి ప్రపంచము తల్లక్రిందులైనట్లయ్యెను. నడివీధినొక పిల్లిమంత్రము వైచెను. మతి తెలియునప్పటికి క్రింద పడియుండెను. వెంటనే లేచి దిక్కులుచూచెను. తనవెనుక రిక్షా నేలకు ఒరిగియుండెను. రిక్షావాడు వైద్యశాల వైపునకు వెఱ్ఱిగా పరువిడుచుండెను. హటాత్తుగ నాతనికి మెరుపువలె సత్యము స్ఫురించెను. వెంటనే తన మందుల పేటికతో వైద్యాలయమునకు వడివడిగాపోయెను.

రామిగాడు వచ్చునప్పటికి లచ్చి కన్నులు తెరచెను. తుదిక్షణ మాతని చూచు భాగ్యమునకు నోచుకొనెను కాబోలు! గుర్తించినట్లు చిరునవ్వు నవ్వెను. అంతే. దేహ మల్లే కొయ్యబారెను.

తెల్లవారులు సత్రాధిపతి కాలుగాలిన పిల్లివలె నుండెను. ఆమెమరణమునకు తానే బాధ్యుడని మిక్కిలి వగచెందెను. అది ఇంకొకరికి తెలుపరాని బాధ!... సత్రాధిపత్యము రామిగానికి చెందునట్లు దస్తావేజు వ్రాసి వైద్యునికంపి, తాను శిరోముండనము గావించుకొని సన్యాసులలో కలసిపోయెను.